లోకమంతా వుచ్చపువ్వులా వెన్నెల విరగబడి కాస్తున్న వేళ భజన మందిరం లోంచి 'ఓం శ్శాంతి, ఓం శ్శాంతి, ఓం శ్శాంతి'అంటూ మువ్మారు శాంతి వచనాలతో భజన కార్యక్రమం పూర్తి అయింది. భక్తజనులంతా బిలబిల్లాడుతూ మందిరంలోంచి బయటికి వస్తున్నారు.

మెల్లగా నడుస్తున్న జానకిరామయ్యగారు వీథి మలుపు తిరుగుతుండగా 'మాస్టారూ' అన్న పిలుపు విని వెనుతిరిగి చూశారు.

సుధాకర్ వడి వడిగా నడుస్తూ దగ్గరగావచ్చి, 'ఎక్కణ్ణించి,మాస్టారూ?' అన్నాడు, సరసనే నడుస్తూ.

. 'గురువారం గదుటోయ్! భజన ఇప్పుడే పూర్తయింది. ను వ్వెక్కడ వించి? హోటలా!' జానకిరామయ్యగారు ప్రసాదాన్ని జాగ్రత్తగా రుమాల్లో మట్టే పట్టుకుంటూ అడిగారు.

'సరే, మాస్టారూ. ఈ పూట ఆ అయ్యరుగాడిని సాంబారులో స్నానం చేయిద్దామన్నంత కోపం వచ్చిం దను కోండి. దరిద్రపు తిండి' అంటూ వచ్చేసి, 'మిగతా హోటల్స్ కంటే వీడు కాస్త నయమే లెండి, మాస్టారూ!' అన్నాడు.

'ఎందుకొచ్చిన బాధోయ్ ఇది? మీ అమ్మగారిని తెచ్చి దగ్గర పెట్టుకో. లేదంటావా హాయిగా పెళ్ళి చేసుకో—' జానకిరామయ్యగారు సలహా చెప్పారు.

సుధాకర్ నవ్వేశాడు. 'లేదులెండి, మాస్టారూ! మా అమ్మ ఆ పల్లెటూరిని, మా నాన్నగారిని వదిలి పెట్టి ఒక నిమిషం కూడా ఉండలేదు' అన్నాడు.

'పోనీ హాయిగా పెళ్ళి చేసుకోక. . .'

సుధాకర్ ఆయన మాటని దాటేస్తూ, 'రోజూ భజనకి వెడతారా, మాస్టారూ?' అన్నాడు.

'రోజూ ఉండదోయ్. గురువారాలు మాత్రమే జరుగుతుంది.'

నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు మీద వెన్నెల విరగబడి కాస్తుంటే, చల్లగాలి మెల్లగా వీస్తుంటే ఇద్దరూ మౌనంగా నడుస్తున్నారు.

నిజానికి ఆయన మాస్టారు కాదు. అతను శిష్యుడూ కాదు. ఇద్దరూ ఒకే ఆఫీసులో ఒకే చోట పని చేస్తున్న కొలీగ్స్. సుధాకర్ రెండేళ్ళ క్రితమే కొత్తగా చేరాడు. ప్రథమ పరిచయం లోనే జానకిరామయ్యగారంటే గౌరవ భావం అతని మనసులో ముద్ర వేసుకుంది. నిర్మలంగా చిరునవ్వుతో మాట్లాడే తీరు, కష్టపడి పనిచేసే స్వభావం, పరనింద, ఆత్మస్తుతి లేక ముక్కుకు సూటిగా పోయే జానకిరామయ్యగారంటే ఆ ఆఫీసులో అందరూ ఇష్టపడే వారు. వయసులో పెద్దవాడని అందరికీ గౌరవ భావం.

సుధాకర్‌ని చూసిన రోజే ఆయన మనసులో 'చాకులాటి కుర్రాడు' అనుకున్నారు. అతని కలుపుగోలుతనం, వినయవిధేయతలు ఆయనకి నచ్చి నాయి. 'తలిదండ్రులు అదృష్టవంతులు' అనుకునేవారు, ముచ్చటయిన అతని రూపాన్ని చూస్తూ.

అతను పేరుతో గాకుండా 'మాస్టారూ' అంటూ వరస కలిపి సంబోధించటం జానకిరామయ్యగారి దగ్గర చనువు సంపాదించుకున్నాడు. ... 

'ఈ భజనల వల్ల లాభం ఏమిటండీ, మాస్టారూ?' ఉన్నట్టుండి సుధాకర్ అడిగాడు.

జానకిరామయ్యగారు ఒక్క క్షణం ఆగి మెల్లగా నవ్వుతూ అన్నారు: 'కనీసం ఆ కాసేపయినా మనశ్శాంతి దొరుకుతుందేమోనని ఆశ. జీవితాన్ని ముందుకి లాగటానికి తగిన ఆత్మ విశ్వాసం చేకూర్చుకునే ప్రయత్నం.'

సుధాకర్ ఆశ్చర్యపోయినట్టుగా తల తిప్పి చూశాడు. ఆయన చిరునవ్వు మొహం చూసిన వాళ్ళెవ్వరూ ఆయనకి మనశ్శాంతి కరవని ఎలా అనుకోగలరు!

'మాస్టారూ. . .మీ క్కూడా. . .' అంటూ ఆగిపోయాడు.

'ఊం. . . మీక్కూడా మనశ్శాంతి లేకుండా ఉండేటన్ని సమస్య లున్నాయా, మాస్టారూ అని కదూ నీ సందేహం? పిచ్చివాడా! సమస్యలు నా లాటి మధ్య తరగతి వాడికి తప్ప మరెవరి కుంటాయోయ్! నా సంగతే చూడు. మా పెద్దవాడు బి. ఎ. పాసయి రెండేళ్ళుగా నిరుద్యోగిగా ఉన్నాడు. మా పెద్దపిల్ల పెళ్ళీడు కొచ్చింది. మా చిన్నవాడు కాలేజీలో చదువుతున్నాడు. చివరి పిల్లలిద్దరూ ఇంకా చిన్నవాళ్ళు. మా ఆవిడకి కీళ్ళనొప్పులు. పచారీకొట్లో అప్పులు—జీతంలో తెగ్గోతలు. నెలలోసగం గడకుండానే— ఎలారా, భగవంతుడా అన్న బెంగ. . . ఇంకా. . . ఇలాగే.'

సుధాకర్ విచిత్రంగా, కొత్త మనిషిని చూస్తున్నట్టుగా చూశాడు ఆయన వైపు. జానకిరామయ్యగారు స్వభావగా మితభాషి. ఆయన తన విషయాలు నలుగు రెదుటా చెప్పుకోగా అత నెప్పుడూ వినలేదు. కాని, ఆ వెన్నెల రాత్రి, చల్లని గాలి, నిర్మానుష్యమయిన రోడ్డు, అభిమానంగా వినే మిత్రుడు...ఆయన గుండెలో నొక్కిపట్టి ఉంచిన బరువంతా వెల్లువ లాగా బయటికి ప్రవహిస్తుందని ఆయనా గ్రహించలేదు. ఆ చిరునవ్వు వెనకాల అన్ని బాధ లున్నాయని అతనూ అనుకోలేదు.

వీథి పక్కల లైట్ల వెలుగులో మెరుస్తున్న అద్దాల మిఠాయి దుకాణాలు మూసే ప్రయత్నంలో ఉన్నారు దుకాణదారులు. జానకిరామయ్యగారు ఓ రెండు అడుగులు దుకాణం వైపుగా నడిచి ఆగిపోయి, ఓ క్షణం ఆలోచించి తిరిగి నడక సాగించారు. ఆయన భావాన్ని గ్రహించిన సుధాకర్ అడిగాడు:

'ఏమయినా తీసుకుంటారా, మాస్టారూ?'

'వద్దులే, పద' అన్నా రాయన.

'డబ్బు నా దగ్గరుంది, మాస్టారూ! మీరు తీసుకు రాలేదని సందేహించ కండి' అన్నా డతను.

జానకిరామయ్యగారు జేబు తడుముకుని, 'నా దగ్గరా ఉందోయ్ పది రూపాయలు. పదో తారీక్కి చేతులో మిగిలింది అదే' అన్నారు మెల్లగా నవ్వుతూ.

జానకిరామయ్యగారి దృష్టి వరసగా ఉన్న మిఠాయి దుకాణాల మీద ఉంది ఆయన కాళ్ళు అటు లాగుతుంటే. మనసు వెనక్కి జంకుతూంది. నాలుగు రోజులుగా జ్వరంతో బాధ పడ్డ చిన్న కూతురు మందు తాగనని పేచీ పెడుతుంటే, లడ్డూలు తెచ్చి పెడతానని ఆశ పెట్టా రాయన. ఆ పిల్ల రెండు రోజులుగా తండ్రి రాగానే ఆశగా లడ్డూల పొట్లం కోసం ఎదురు చూస్తూంది. రోజు కో సాకు చెప్తున్నా రాయన. ముఖ్యంగా ఎల్లుండి అరుణకి పెళ్ళి వారొస్తున్నారు. ఈ సమయంలో చేతిలో మిగిలిన పది రూపాయల్లో ఒక్క రూపాయయినా

— షీలా శివరామ్ —

# రేపటి కల

వరే ఖర్చు పెట్టడం ఆయనకి ఇష్టం లేదు.

'ఎల్లుండి విదియ నాడు మా అమ్మాయికి పెళ్ళి చూపులు కొమ్మన్నా రోయ్' అన్నా రాయన, మిఠాయి దుకాణాలు దాటిపోతుండగా.

సుధాకర్ మౌనంగా విన్నాడు. ఉన్నట్టుండి ఆయన స్వరం ఆవేదనగా వినిపించింది వినటానికి. 'ఇప్పటికెంతమందో వచ్చి చూసి పోయారు. పిల్ల బాగానే ఉందట. కానీ...ఆ కానీ దగ్గరే ఉందోయ్ తిరకాసంతాను. అయినా నేనికి తమ్ముడు పడేసిన వెధవ ఒక్కడు లేడనుకో. మా అరుణని చూశావు కదా! ఏం లోటు చెప్పు? మెట్రిక్ పాసయింది. ప్రైవేటుగా హిందీ పరీక్షలు కట్టింది' అన్నా రాయన.

సుధాకర్ రెండు మూడు సార్లు వాళ్ళింటికి వెళ్ళినా, అరుణ నెప్పుడూ చూడలేదు.

'రేపు వచ్చేది దూరపు బంధుత్వం ఉన్నవాళ్ళే. ఒక్కడే కొడుకు. కుర్రాడికి తండ్రి హఠాత్తుగా పోయాడు. చిన్నవి పెళ్ళి చేసి పోయాడు కాదు. పాపం, చాలా కష్టపడిందట ఆవిడ, కొడుకుని పైకి తీసుకు రావటానికి. ఆ రోజుల్లో నా చేతనయిన సాయం నేనూ చేశాననుకో! కుర్రాడు బి.ఇడి. పాసయ్యాడు. ఏదో జిల్లా పరిషత్ స్కూల్లో టీచరుగా ఉంటున్నాడు. అరుణని చూసిన తరవాత కాదనడనే అనుకుంటున్నాను' అంటూ ఆగా రాయన.

సుధాకర్కి ఆయన తీరు చాలా ఆశ్చర్యం కలిగిస్తూంది. ఆయ నెప్పుడూ తనతో ఇంతగా మాట్లాడలేదు. పైగా స్వవిషయాలు! ఆ, ఊఁ అనకుండా వింటూ నడుస్తున్నాడు. ఉన్నట్టుండి నారాయణయ్యగారు ఆగి, తల తిప్పి సుధాకర్ని పరీక్షగా చూశారు. ఆయన గుండెని చీల్చుకుంటూ విసుర్రాటి శబ్దం వినబడింది. సుధాకర్



తల ఎత్తి విస్మయంగా ఆయన్ని చూశాడు.

'సుధాకర్! నా కేం అనిపిస్తూ ఉంటుందో తెలుసా? నీ లాంటి కుర్రాడ్ని భర్తగా పొందిన ఆడపిల్ల ఎంతో అదృష్టవంతురాలనిపిస్తుంది. ఆ అదృష్టవంతురాలు నా కూతురే ఎందుక్కాకూడదు అనుకుంటూ ఉంటాను.'

సుధాకర్ తెల్లబోయి చూశాడు. ఆయన ఇదేం గమనించే స్థితిలో లేరు.

'కానీ ఈ కులాలు, వర్గాలు మన చేతులు కట్టేశాయోయ్. నువ్వో చివర, నేనో చివర. కనీసం మీ ఇద్దరూ ప్రేమించుకున్నా ఉంటే, అది కారణంగా మీ పెళ్ళి జరిపించి ఉండేవాడ్నేమో! కాని, ఇప్పుడు చూడు నా అంతట నేనే మీ పెళ్ళి చేశాననుకో. లోకం దుయ్యబట్టదుటయ్యా నన్ను. నా మిగిలిన పిల్లల మంచి చెడ్డలు ఆలోచించాల్సిన బాధ్యత నా మీద ఉందంటావా, లేదా?'

సుధాకర్ బిత్తరపోయి చూస్తున్నాడు. ఈయనకి ఉన్నట్టుండి మెంటల్ షాక్ రాలేదు గదా అన్న అనుమానం క్షణం క్షణం పెరిగిపోతూంది అతనిలో. తనకి తెలిసిన జానకిరామయ్యగారికి, తన పక్కన నడుస్తున్న వ్యక్తికి పోలికే లేదనిపించింది. కాని, తనని చూసిన దగ్గరనుంచీ ఆయన అంతరాంతరాల్లో పెరుగుతున్న కోరిక ఇలా అసందర్భంగా బయట పడిందన్న అతనికి తెలియదు.

'అఫ్‌కోర్స్. మీ వాళ్ళెవరూ ఒప్పుకోరనుకో. నీకు లక్షల కట్నంతో పిల్లనిచ్చేందుకు సిద్ధంగా ఉంటారనుకో. కాని, ఈ ఆశ అనేది ఉంది చూశావ్, అది మహా గొప్ప సూచిక్కులు చేయిస్తుందోయ్.' హఠాత్తుగా ఆయన కంఠం బొంగురుపోయినట్లనిపించింది సుధాకర్‌కి.

చేత్తో మెల్లగా ఆయన్ని తట్టుతూ, 'మాస్టారూ' అంటూ పిలిచాడు మరేం చెయ్యాలో తెలియక.

ఆయన ఒక్క క్షణం సుధాకర్ వైపు తదేకంగా చూసి, కలల్లోంచి బయట పడ్డ వ్యక్తిలా చేత్తో గట్టిగా మొహాన్ని రుద్దుకుని, నలు దిక్కులా పరికించి చూశారు.

అప్పటివరకూ తను మాట్లాడిన మాటల కర్థం అప్పుడే తనకి బోధపడినట్టుగా చూస్తూ, 'చూడు, నే నేదేదో మాట్లాడేస్తున్నాను కదూ! ఎందుకో ఈ రోజు ఈ వాతావరణం, పరిసరాలు, నువ్వు, నేను ఇలా నడుస్తుంటే మనను గట్లు తెంచుకుని పారిపోయిందనుకో. ఏమనుకోకు. నే నేమన్నా అసభ్యంగా మాట్లాడానా?' అన్నా రాయన.

సుధాకర్ మోహమాటంగా తల ఊపుతూ, 'లేదు, మాస్టారూ! మీ రెందుకో ఈ రోజు చాలా బాధ పడుతున్నారు' అన్నాడు మెల్లగా.

సుధాకర్ విడిపోవలసిన వీథి దగ్గరగా ఆగి, 'వస్తాను, మాస్టారూ' అన్నాడు.

ఆయన మౌనంగా తలఊపి ముందుకి నడిచారు. తల వంచుకుని అలా నడిచి పోతున్న ఆ వ్యక్తిని చూస్తూ రెండు నిమిషాలు అక్కడే నిలబడి పోయాడు.

● ● ●

'అదుగో, వాళ్ళొచ్చేశారు. వచ్చేశారే, అమ్మా' అంటూ పదేళ్ళ గౌరి పరుగెత్తుకుంటూ వచ్చింది లోపలికి. ముందు గదిలో చాప పరుస్తున్న అరుణ చటుక్కున లోపలికి తప్పుకుంది.

జానకిరామయ్యగారు వాళ్ళని వెంట బెట్టుకుని లోపలికి వచ్చారు.

'కూర్చోవోయ్, వేణూ, కూర్చో' అంటూ కుర్చీ చూపించి, 'ఇదిగో, ఏమేవ్, చూడు చెల్లాయి వాళ్ళొచ్చారు' అంటూ కేక పెట్టారు.

పార్వతమ్మగారు లోపలినుంచి వస్తూ, 'రా, వదినా! రా రా, ఎట్లా ఉన్నారు? చాలా కాలానికి చూశాం. . . కూర్చోండి' అంటూ మర్యాద చేసింది.

జానకిరామయ్యగారు సుధాకర్‌కి చెప్పిన పెళ్ళి చూపుల వాళ్ళు వీళ్ళే. జానకమ్మ సన్నగా, పీలగా, సగం నెరిసిన తల, కళ్ళజోడుతో కష్టం సౌ లెక్క సయిన మనిషి లాగే ఉంటుంది. ఆవిడ భర్త హఠాత్తుగా పోవడంతో మిషను కుట్టి, పెద్ద ఇళ్ళ వాళ్ళని మంచి చేసుకుని కొడుకుని బి. ఇడి. టీచరుగా చేసింది. ఆవిడ మిషను కొనటానికి అప్పు దొరక్క ఇబ్బంది పడ్డప్పుడు, కుర్రాడి కాలేజీ చదువుకి అవసరమయినప్పుడు అడపా దడపా జానకిరామయ్యగారు తన శక్తి మేరకు సహాయ పడేవారు. ఆవిడకి తన మీద అభిమానం ఉందనే ఆయన ఉద్దేశ్యం.

కుర్రాడు మనిషి సాగారుగా బాగానే ఉన్నాడు. పెళ్ళి చూపులు యథావిధిగా జరిగినాయి. జానకిరామయ్యగారు మిగిలిన పది రూపాయలు ఖర్చు పెట్టి స్వీటు, హాటు, పళ్ళు, పూలు—అన్నీ ఏర్పాటు చేశారు.

అరుణని చూసినప్పుడు వేణు కళ్ళలో తృప్తిని గమనించి తేలిగ్గా ఊపిరి తీసుకున్నారు. అరుణ ఒకే ఒక్కసారి తల ఎత్తి ఆ కుర్రాడి వైపు చూసినప్పుడు, ఆయన కూతురి కళ్ళలోకి చూడటానికి భయపడ్డారు. ఆ కళ్ళలో మెరిసే మెరుపుని చూస్తే ఆయనకి జంకు. ఆ మెరుపుని దీపంగా చేసి నిలపగల శక్తి తన కుందో, లేదో అని ఆయన భయం.

'చూడు, చెల్లాయ్, పిల్లని చూశావు గదా! నీ ఇంట్లో పడేస్తే నాకు విశ్రాంతి. దాన్ని గురించి నీ కంతా తెలుసు గనక నేను చెప్పేదేం లేదనుకో. ఇక కట్న కానుక లంటావా. . . దాని పెళ్ళి కోసమే కడుపు, కాలు కట్టుకొని రెండు వేలు జమ చేశాను. అది నీ చేతుల్లో పెడతాను. పెళ్ళి ఖర్చులకి పైన ఎక్కడో వెతకాలి సిందే! నా చేతనయినంతలో నీ కేం లోటు చెయ్యను. ఈ అన్నయ్యని మరిచి పోకు.' వాళ్ళని బస్సు ఎక్కిస్తూ జానకమ్మ చేతులు పుచ్చుకుని ఇంచుమించు బతిమాలినట్టే చెప్పారు.

'అలాగే, అన్నయ్యా! నువ్వింతగా చెప్పాలా? నేను వాడి నడిగి ఏ సంగతీ రాస్తాగా!' అం దావిడ.

వారం రోజుల తరవాత జానకమ్మ దగ్గరనుంచి వచ్చిన ఉత్తరం చూసి ఆయన నీరుకారిపోయారు. వాళ్ళ ఊరి మోతుబరి రైతు నాలుగెకరాల పొలంతో పిల్లనివ్వటానికి సిద్ధ పడ్డాడని, కొడుకుకూడా ఆటే మొగ్గుతున్నాడని, వాళ్ళ మధ్య ఉండవలసిన వాడే గనక కొడుకు భవిష్యత్తుకి వాళ్ళ అండదండలు ఎంతో ముఖ్యమని, తనని క్షమించమని రాసిం దావిడ.

ఈ సంబంధం తప్పకుండా కుదురుతుందని ఎంతో ఆశ పెట్టుకున్న జానకిరామయ్యగారికి ఈ వార్త గొడ్డలి పెట్టులాగే అయింది. కళ్ళు మూసుకుని ప్రాణం లేనట్టుగా కుర్చీకి చేరబడి పోయారు. ఎదురుగా టేబిలు మీద జానకమ్మ రాసిన ఉత్తరం గాలికి ఎగిరి కింద పడింది.

నారాయణ పిల్లిలా అడుగు లేస్తూ వీథిలోకి వెడుతున్న వాడల్లా తండ్రి పిలుపు విని చటుక్కున ఆగిపోయాడు.

'నారాయణా! ఉత్తరం చూశావురా?' అన్నా రాయన.

నారాయణ తండ్రి కళ్ళతో చూపించిన ఉత్తరాన్ని కింద నించి తీసి చదివాడు.

ఈ నారాయణే జానకిరామయ్యగారి పెద్ద కొడుకు. జానకిరామయ్యగారు శాయశక్తులా ప్రయత్నం చేసినా, విసుగు చెందని విక్రమార్కుడిలా దరఖాస్తు ఫారాలకే చదువుని మించిన డబ్బు ఖర్చు పెట్టినా, బి. ఎ. పాసయి రెండేళ్ళయిన నారాయణకి నిరుద్యోగ దేవత కరుణా కటాక్షమే మిగిలి పోయింది. నారాయణకి తన సమర్థత మీద తనకే అపనమ్మకం, కోపం. తండ్రి ఎదుట పడాలంటే సిగ్గు, అభిమానం. తల్లి పెట్టిన అన్నం తింటూంటే కళ్ళ నిండుగా నీళ్ళొస్తాయి. తండ్రికి చెయ్యి ఆసరా ఇయ్యవలసిన వయసులో అసమర్థుడిలా ఆయన రక్తాన్ని పట్టుకుని పీలుస్తున్న జలగలా తన్ను తనే భావించుకుని అభిమాన పడతాడు. తండ్రిని అత్యవసరాలకి డబ్బు అడగాలంటే ప్రాణం చచ్చిపోయినట్టవుతుంది. జానకిరామయ్యగారు ఇంట్లో ఉన్న సమయాల్లో తప్పు చేసినట్టుగా ఆయన్ని తప్పుకు తిరుగుతాడు. ఎప్పుడో అందరి భోజనాలు అయిపోయిన తరవాత తిండికి వస్తాడు.

తండ్రికి కొడుకు అంతర్యం బాగానే తెలుసు. ఆయన మాత్రం చెయ్యగలిగిందేం లేక, తన దురదృష్టానికి బాధ పడతారు.

నారాయణ నాలుగు నెలల క్రితం తండ్రిని ఓ రూపాయి అడగటానికి అభిమాన పడిపోయాడు. అదీ పెరిగిన తలని ఓ ఆకారానికి తీసుకురావటానికే!



చిత్రాంగి
చిత్రం—ఎ. ప్రభాకర్ (జగిత్యాల)

ఆయన మాట తడబడుతూంది. శరీరం కంపిస్తూంది. సుధాకర్ తనకి, ఆయనకి కూడా పర్మిషన్ తీసుకుని రిక్షాలో కుర్రాళ్ళు చూపించిన చోటికి వచ్చారు.

మధుని ఆపరేషన్ థియేటర్లోకి తీసుకువెళ్ళబోతున్నారు. తల చుట్టూతా కట్టిన తుండులాటి బట్ట పూర్తిగా రక్తంతో తడిసిపోయింది. బట్టలన్నీ రక్తపు మరకలు. నెత్తుటిలో బీభత్సంగా ఉన్న మధు మొహాన్ని చూడలేక పోయా రాయన. ఒళ్ళు తూలింది. కళ్ళు చెదిరినట్టయింది. చెయ్యి చాచి సుధాకర్ భుజాన్ని గట్టిగా పట్టుకున్నారు. సుధాకర్ ఆయన భుజం చుట్టూ చెయ్యేసి పట్టి నడిపించి తీసుకొచ్చి వరండాలో బెంచీ మీద కూర్చోపెట్టాడు.

'మరేం ఫరవాలేదు, మాస్టారూ. కంగారు పడకండి' అంటున్నాడు అనునయంగా.

నర్సు పిలుపుతో ఇద్దరూ లేచి డాక్టరుగారి రూమ్‌లోకి వచ్చారు. డాక్టరుగారు తెల్లటి బట్టల్లో శాంతి దూతలాగా కనిపించారు.

'మీరేనా కుర్రాడి తాలూకు' అన్నా రాయన.

'కుర్రాడి ఫాదరండీ' అంటూ జానకి రామయ్యగారిని చూపించాడు సుధాకర్.

'చూడండి. గాయం ప్రమాదకరమయిందే. తలంతా గాజు పెంకులు గుచ్చుకున్నాయి. మా ప్రయత్నం మేం చేస్తాం. మరి...' అంటూ ఆగి పోయారు డాక్టరుగారు మాటిమాటికీ మాట్లాడుతూ, ఒక్క క్షణంకూడా వ్యర్థం చెయ్యటానికి ఇష్టం లేనట్టు.

జానకిరామయ్యగారి నోటమ్మట ఒకే ఒక్క మాట వచ్చింది. 'డాక్టరు గారూ! వాడి నెలాగైనా బతికించండి. నా డబ్బుకి ఏం ఫరవాలేదు. ఎంత డబ్బయినా సరే, డాక్టరుగారూ, వాడిని బతికించండి. డబ్బు కోసం చూడకండి, డాక్టరుగారూ!' అన్నారు. కళ్ళజోడు తీసి చేత్తో గట్టిగా మొహం తుడుచుకుని డాక్టరుగారు చూపిన ఫారం మీద సంతకం పెట్టి, వరండాలో కొచ్చి కూర్చున్నారు. సుధాకర్ ఆయన పక్కనే నిలబడ్డాడు.

ప్రాణం లేని నిర్జీవిలాగా కూర్చున్న జానకిరామయ్యగారి కళ్ళలో అరుణ పెళ్ళికి దాచిన రెండు వేలు కదిలింది. తన డబ్బుని ఎంత ఉపద్రవం వచ్చినా వాడకుండా ఎంత జాగ్రత్తగా దాచారని! పార్వతమ్మకీ కీళ్ళ నొప్పు లెక్కువయి నప్పుడుకూడా అందులోంచి ఒక్క పైసా తాకలేదు. నారాయణ ఎమ్. ఎ. చదువుతానన్నప్పుడు వీల్లేదు పొమ్మన్నారు. మరెన్నో ఒత్తిడులు, ఇబ్బందులు— అన్నింటినీ ఎదుర్కొన్నా, ఆ డబ్బులోంచి ఒక్క పైసాకూడా తియ్య లేదు. తన కూతురి పెళ్ళి కోసం, తన అరుణ తల్లి పెళ్ళి కోసం రక్తం ఓడ్చి దాచిన డబ్బది. కానీ, ఇప్పు డాయనకి అరుణ గానీ, పెళ్ళి గానీ, మరేదీ గుర్తుకు రావటం లేదు. మధు...తన కొడుకు... తన ముద్దుల కొడుకు ప్రాణం నిలవాలి. అంతే. అంతే.

జానకిరామయ్యగారికి పిల్ల లందరి లోనూ మధు పైన మక్కువ జాస్తి. వాడికికూడా అందరి దగ్గరి కంటె తండ్రి దగ్గరే చేరిక ఎక్కువ. వాడు పక్కన లేనిదే ఆయనకి భోజనం చేసినట్టుండదు. వాడు తన పక్క మంచం మీద లేకపోతే నిద్ర పట్టినట్టుండదు.

మధుని నర్సింగ్ హోమ్‌కి తీసుకు వచ్చిన కుర్రాళ్ళు సుధాకర్‌తో చెపుతున్నారు. పరీక్షలు జరుగుతుండగా వాచర్ ఓ కుర్రాడి దగ్గర కాపీ పట్టుకుని వాడిని పరీక్ష హాల్లోంచి బయటికి పంపేశాడని, వెంటనే మిగిలిన పిల్లలంతా రాస్తున్న పరీక్షని వదిలేసి హాల్లోంచి బయటి కొచ్చేసి ఆ కుర్రాడిని పరీక్ష రాయనివ్వాలని గొడవ చేశారని, ఇంతలో ప్రిన్సిపల్ పిలుపు మీద పోలీసులు రావటంతో కుర్రవాళ్ళు రెచ్చిపోయి గొడవ జరుగుతుండగా ఎవరో వెనక నించి విసిరిన సీసా వచ్చి మధు తలకి తాకి బద్దలయిందని, తల పగిలి పడిపోయిన మధుని వాళ్ళు దగ్గరలో ఉన్న నర్సింగ్ హోమ్‌లోకి చేర్చి జానకిరామయ్యగారికి కబురు అందజేశారట. జానకి రామయ్యగారికి ఆ క్షణంలో ఈ చదువుల మీద, కాలేజీల మీద, కుర్రాళ్ళ మీద, ఉపాధ్యాయుల మీద, ఈ మనుషుల మీద, ఈ ప్రపంచం మీద చెప్పలేనంత కోపం, అసహ్యం, రోత కలిగాయి. చదువులయ్యే వరకు స్ట్రైకులు, ఘెరావోలు, పోలీసులు, లాఠీ ఛార్జీలు... అవయ్యాక ఇంత కష్టపడి చదివిన దాని ఫలితం పట్ట చేత బట్టుకుని కాళ్ళరిగేట్టు తిరగటం—ఫలితం నిరాశ, నిస్పృహ, తెంపరితనం, పగ, కసి. మనుషుల్లో ఇంతగా క్రమశిక్షణ ఎందుకు నశించి పోతూంది? ఎందు కీ అశాంతి? అల్లకల్లోలాలు? ఎందుకు ఇంతగా న్యాయం, ధర్మం నశించి పోతున్నాయి? యుగయుగాలుగా ప్రపంచం ఇలాగే అశాంతిగా నడుస్తూ వెడుతూందా? లేక ఈ కలియుగాని కేనా ఈ అనర్థం? ఎక్కడుంది దీనికి జవాబు? ఎక్కడుంది ఈ వ్యవస్థ...లోపం? మానవుడు నిశ్చింతగా గుండె మీద చెయ్యేసుకుని బతికే రోజే లేదా? ఇక రాదా?

బెంచీమీద నిరద్యాసంగా కూర్చుని ఆలోచనల్లో కొట్టుకుపోతున్న జానకిరామయ్యగారు, కబురు తెలిసి గుండెలు బాదుకుంటూ వచ్చిన పార్వతమ్మ గారి ఏడుపుతో ఈ లోకంలో పడ్డారు.

సుధాకర్ ఆవిడని గట్టిగా ఏడవ నద్దని, ప్రమాదం లేదని, మధుకి ఆపరేషను జరుగుతుందని నచ్చచెప్తున్నాడు. నారాయణ మధుని చూడటానికి గుంపులుగా వచ్చిన కాలేజీ కుర్రాళ్ళ దగ్గర నిలబడి వివరాలు తెలుసుకుంటున్నాడు. అరుణ అందరు చెప్పేది వింటూ, భయంతో, పాలిపోయిన మొహంతో తండ్రి దగ్గరగా నిలబడింది.

సుధాకర్ మొదటిసారిగా అరుణని అప్పుడే చూశాడు. మెలిక్కి తిరిగిన అరుణ నడుం మీద పొడవాటి జడ అందంగా ఊగింది. ఆ పిల్ల కళ్ళలో అమాయకత్వం లేదు. ప్రపంచాన్ని చదవగల చూపది. ఆ మొహంలో వింత ఆకర్షణ లేదు. సౌమ్యంగా, వినయంగా ఉంది.

ఆ రాత్రికి గానీ మధుకి స్పృహ రాలేదు. అప్పటిగ్గానీ డాక్టరు గండం గడిచిందని చెప్పలేదు.

మధు ఇరవై రోజుల తరవాత ఇంటికి వచ్చాడు. జానకిరామయ్యగారు అరుణ పెళ్ళి కోసం దాచిన రెండు వేలలో పదిహేను వందలు ఖర్చయి పోయాయి.

ఆయనకి ఇప్పుడు తన సంసారాన్ని తను సరిదిద్దుకోగల నన్న నమ్మకం



